అధ్వానంగా బీటీ రోడ్లు

- భారీవర్షాలకు దెబ్బతిని కంకరతేలిన వైనం
- రాకపోకలకు ఇబ్బందిపడుతున్న ప్రయాణికులు
- మరమ్మతులు చేయించాలని వేడుకోలు
- పట్టించుకోని అధికారులు



తారు లేచిపోయి కంకర తేలిన ఝరి(బి) రహదారి



గుంతలమయంగా మొగ్లి రహదారి

తానూరు: మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షాలకు బీటీరోడ్లు కంకరతేలి అధ్వానంగా మారాయి. దీంతో ఈ రోడ్లపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేయించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు.

మండలంలో..

తానూరు మండలంలోని తానూరు -మొగ్లి, జౌలా(బి)-ఖర్బాలా, ఝరి(బి)-ఝరి(బి)తండా సోనారిఎక్స్‌రోడ్డు-బామ్ని, ముధోల్ ఎక్స్ రోడ్డు నుంచి దాగాం, బెంబర గ్రామాల మధ్య ఉన్న బీటీరోడ్లు భారీ వర్షాలకు గుంతలమయంగా మారాయి. దీంతో ఈ గ్రామాలకు వెళ్లే ప్రజలకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఏళ్ల కిందట నిర్మించిన అధికారులు.. అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై ప్రయాణిస్తే ఒళ్లు హూనమవడం, సమయం వృథా కావడంతోపాటు వాహనాలు కూడా తరచుగా మరమ్మతులకు గురవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్లు సరిగా లేక ప్రైవేటు వాహనదారులు సైతం అధిక చార్జీలను వసూలు చేస్తున్నారని వాపోతున్నారు.

మండలంలోని మొగ్లి, ఖర్బాలా, ఎల్వత్ , బామ్ని, దాగాం, బెంబర, ఝరి(బి) గ్రామాలకు ఉన్న బీటీ రోడ్ల పరిస్థితి అధ్వానంగా మారింది. రాత్రివేళ రాకపోకలు సాగించేటప్పుడు ప్రమాదాల బారిన పడుతున్నట్లు ద్విచక్ర వాహనదారుల పేర్కొంటున్నారు.

అధికారులు, పాలకులు స్పందించాలి..

మండలంలోని గుంతల రోడ్లపై ప్రయాణం సాగించేందుకు భయపడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని వేడుకుంటున్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



ఝరి(బి) నుంచి ఝరి(బి)తండా వరకు ఉన్న బీటీ రోడ్డు దెబ్బతిని గుంతలమయంగా మారింది. దీంతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. రాత్రివేళ వాహనదారులు ప్రమాదాల అదుపు తప్పి కింద పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల సమస్యలు పరిష్కరించాలి.

– పాండురంగ్, ఝరి(బి)తండా

ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం

తానూరు మండలంలోని ఆయా గ్రామాల్లో పర్యటించి రోడ్లను పరిశీలిస్తాం. దెబ్బతిన్న బీటీరోడ్లకు మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. నిధులు మంజూరవగానే మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల సమస్యలు పరిష్కరిస్తాం.

– చందు, పీఆర్ డీఈ

బీజేపీ, కాంగ్రెస్‌ల మాటలు నమ్మొద్దు

- బీఆర్‌ఎస్‌తోనే మరింత అభివృద్ధి
- మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నిర్మల్‌టౌన్ : గాంధీనగర్‌లో ప్రచారం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మొద్దని.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ నియోజకవర్గ ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ఆదివారం పట్టణంలోని భాగ్యనగర్, గాంధీనగర్, కచ్చి కాలనీ, కబూతర్ కమాన్, గొల్లపేట్ చర్చి, శాంతినగర్ చర్చి, గాజుల్‌పేట్ చర్చిల వద్ద జోరుగా బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి బీఆర్‌ఎస్ సంక్షేమ పథకాలను వివరించారు. ఈసందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలోనే జిల్లాలో మెడికల్ కళాశాల, ఇతర సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు. మహేశ్వర్‌రెడ్డి 2009 నుంచి 2014 వరకు అధికార కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేగా ఉన్నా.. నిర్మల్‌కు చేసిందేం లేదని విమర్శించారు. బీజేపీ వాళ్లు హిందువులు అనడం ఏంటని.. దేశంలో అందరూ సమానమేనని తెలిపారు. అనంతరం స్థానిక ఏఎస్ రెడ్డి క్లబ్ హౌస్‌లో గౌడ సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, మాజీ చైర్మన్ అప్పాల గణేశ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రాజేందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు రాము, నాయకులు అప్పాల ప్రభాకర్, గంట రాకేశ్, అప్పాల మహేశ్, పూదరి సాయికృష్ణ, జగడం రాజు కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రచారంలో క్రికెట్ మ్యాచ్ వీక్షణ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రియదర్శినినగర్‌లో ఆదివారం రాత్రి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఇంద్రకరణ్‌రెడ్డి ఎన్నికల ప్రచార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమావేశంలో ఆస్ట్రేలియా–భారత్ క్రికెట్ ఫైనల్ మ్యాచ్ వీక్షించేలా స్క్రీన్ ఏర్పాటు చేశారు. కాలనీవాసులతోపాటు అటు వైపు నుంచి వెళ్లేవారు మ్యాచ్ చూస్తూ అక్కడే నిలిచిపోయారు.



పార్‌పెల్లిలో మాట్లాడుతున్న సురేందర్‌రెడ్డి

ఐకేరెడ్డిని గెలిపించాలని ప్రచారం

లక్ష్మణచాంద: నిర్మల్ ఎమ్మెల్యేగా ఐకేరెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి అల్లోల సురేందర్‌రెడ్డి నాయకులతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు మండలంలోని మల్లాపూర్, పార్‌పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గతంలో మాదిరి గ్రామం నుంచి బీఆర్‌ఎస్‌కు అధిక మెజార్టీ ఇవ్వాలని కోరారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి, గోవర్ధన్, రాజేందర్, శ్రావణ్, ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

మామడ: మండలంలోని పొన్కల్ గ్రామంలో బీఆర్‌ఎస్ అధికార ప్రతినిధి ముడుసు సత్యనారాయణ, నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో దేవేందర్‌రెడ్డి, గంగారెడ్డి, సుధాకర్‌రెడ్డి, గంగన్న, భాస్కర్, రాజన్న, అశోక్ తదితరులు ఉన్నారు.



మామడ: పొన్కల్‌లో నాయకుల ప్రచారం

నిర్మల్‌రూరల్: రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిన బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని మళ్లీ ఆదరించాలని ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి ఓటర్లను కోరారు. మండలంలోని రత్నాపూర్‌కాండ్లీ గ్రామంలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవర్ధన్ రెడ్డి, సంపత్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

హరినామ సప్తాహం ప్రారంభం



తానూరులో ప్రారంభమైన సప్తాహం

తానూరు: మండల కేంద్రంలోని విఠలేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అఖండ హరినామ సప్తాహం ప్రారంభమైంది. ఉదయం జ్ఞానేశ్వరి పారాయణం, మధ్యాహ్నం గాత భజన నిర్వహించారు. అంతకు ముందు పింటు మహారాజ్ ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.


వాహనాల తనిఖీ



తరోడాలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ముధోల్: మండలంలోని తరోడా గ్రామంలో ఆదివారం పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల నేపథ్యంలో వాహనాల్లో డబ్బులు, మద్యం తరలించకుండా కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఓటుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై హన్మాండ్లు

కుంటాల: సామాన్యుడి ఆయుధం ఓటుహక్కని..మద్యం, డబ్బు వంటి ప్రలోభాలకు లొంగకుండా ధైర్యంగా సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై హన్మాండ్లు కోరారు. ఆదివారం మండలంలోని దౌనెల్లి గ్రామంలో ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎండీ హైమద్, ఉప సర్పంచ్ శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి సురేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నిర్మల్‌రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సాయిరాం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

23 నుంచి ఆలయ వార్షికోత్సవం



ఖానాపూర్: పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం ఈనెల 23 నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా 23న పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురారోపణ, కులదేవత స్థాపనం, 24న యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, యజ్ఞం, ధ్వజారోహణం, గరుడపెల్లి, ఎదుర్కోలు, స్వామివారి కళ్యాణం, 25న యజ్ఞం, సామూహిక కుంకుమార్చన, 26న మహాలక్ష్మీయాగం, సుదర్శనయాగం, దీపారాధన, 27న రథయాగం, రథబలి, ఆకాశదీపం, లడ్డూ లక్కీడ్రా, రథయాత్ర, జాతర, కార్యక్రమాలు ఉంటాయన్నారు. వాసుదేవాచార్యులు, నర్సింహమూర్తి బృందం ఆధ్వర్యంలో పూజాది కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

భీమన్న జాతర



భీమన్నస్వామి ఊరేగింపు

మామడ: మండలంలోని పొన్కల్ భీమన్నస్వామి ఆలయ ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. సోమవారం ఆలయంలో భీమన్నస్వామి కల్యాణం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. గోదావరి నదికి భీమన్న ఉత్సవ విగ్రహాలను తీసుకెళ్లి పుణ్యస్నానాలు, పూజలనంతరం తిరిగి ఆలయానికి తీసుకొస్తారు. జాతర సందర్భంగా ఆటవస్తువులు, మిఠాయిల దుకాణాలు వెలిశాయి.

గజ్జలమ్మ దేవికి పూజలు



గజ్జలమ్మకు పూజలు చేస్తున్న అర్చకులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు శ్రీ గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. మహారాష్ట్రలోని నాందేడ్, భోకర్ ధర్మాబాద్, శివుని, అప్పారావుపేట్, మలక్‌జాం, ఇస్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నపిల్లలకు తలనీలాలు, తులాభారం వేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదం పంపిణీ చేశారు

బీఆర్‌ఎస్‌కు రాజీనామా

కడెం: బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు ఆ పార్టీ మండలంలోని చిన్నబెల్లాల్, నర్సింగాపూర్ గ్రామ కమిటీ అధ్యక్షులు చెన్నుమల్లేశ్, కందుల సునీల్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ నాయకుల విధానాలు నచ్చకనే పార్టీ అధ్యక్ష పదవికి, సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

ఎండుతున్న 'హరిత' మొక్కలు



లక్ష్మణచాంద: మండలంలోని పొట్టపెల్లి(కే) హనుమాన్ ఆలయ ఆవరణలో హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు నీరందక ఎండిపోతున్నాయి. మొక్కలు నాటడంలో చూపిన ఆసక్తి వాటి సంరక్షణలో లేదని పాలకులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. రాకపోకలకు అవస్థలు



లోకేశ్వరం: మండలంలోని సాథ్‌గాం నుంచి భైంసా మండలం పెండ్‌పెల్లి వెళ్లే రోడ్డు ఇటీవలి వర్షాలకు కోతకు గురైంది. దీంతో పొలాలకు వెళ్లే రైతులు, ఆయా గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

– ప్రశ్నించాల్సిన అధికారి, రఘువంశీ, పీఆర్ ఏఈ, ఫోన్: 95506 07360

బీజేపీతోనే నిర్మల్ అభివృద్ధి

- కలిసికట్టుగా కార్యకర్తలు పని చేయాలి
- ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

సోన్: బీజేపీ అధికారంలోకి వస్తే నిర్మల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాకెర, కడ్తాల్, జాఫ్రపూర్, సిద్దులకుంట, గాంధీనగర్, మాదాపూర్, పాక్‌పట్ల లెఫ్ట్‌పోచంపాడ్, లోకల్ వెల్మల్ గ్రామాల్లో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి అవినీతి, కుటుంబపాలనకు చరమగీతం పాడేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. నిర్మల్‌లో కాషాయజెండా ఎగిరేలా కార్యకర్తలు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లికార్జున్ రెడ్డి, సోన్ ఎంపీపీ మానస హరీశ్‌రెడ్డి, సరికెల గంగన్న, మార గంగారెడ్డి, మేక అశోక్, సర్పంచ్ మైపాల్‌రెడ్డి, మనోహర్, నవీన్ తదితరులున్నారు.



సోన్ : కడ్తాల్‌లో ప్రచారం చేస్తున్న మహేశ్వర్‌రెడ్డి

బీజేపీలో పలువురు చేరిక

లక్ష్మణచాంద: మండలంలోని మల్లాపూర్ గ్రామానికి చెందిన పలువురు ఆదివారం బీఆర్‌ఎస్ నుంచి బీజేపీలో చేరారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మల్లాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ కొడుకు కేశం లచ్చన్న, నీటి సంఘం మాజీ అధ్యక్షులు శంషుద్దీన్, వార్డ్ సభ్యులు గంగమల్లుతో పాటు 20 మంది యూత్ సభ్యులు ఎంపీపీ అడ్వాల పద్మ, రమేశ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. సర్పంచ్ రవి, శంకర్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: మండలంలోని ముఠాపూర్ పీఏసీఎస్ చైర్మన్, ముదిరాజ్ సంఘ జిల్లా అధ్యక్షుడు బొండ్ల గంగాధర్ ఆదివారం 50 మందితో బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేసి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, భూపాల్ రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, భూపతిరెడ్డి, సుంకరి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ సీఎం

నిర్మల్‌రూరల్: బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తి సీఎం అవుతాడని బీజేపీ సీనియర్ నాయకులు రావుల రాంనాథ్ అన్నారు. ఆదివారం మండలంలోని తల్వేదలో మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేపట్టి దళిత వర్గాలను ఆదుకుంటామని పేర్కొన్నారు. మండలాధ్యక్షుడు, సర్పంచ్ తోకల అనిల్, నరేందర్, రాజు, రాజేందర్, భోజన్న, అజయ్, దేవేందర్ పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఏలేటి మహేశ్వర్‌రెడ్డిని గెలిపించాలని ఆయన సతీమణి కవితారెడ్డి ఓటర్లను కోరారు. ఆదివారం మండలంలోని తిర్పెల్లి, చామన్‌పెల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఆమెకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో నాయకులు చిన్నయ్య, ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్, సాగర్‌రెడ్డి, రమణ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేగా గెలిపిస్తే అభివృద్ధి చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్



ఖానాపూర్: ప్రచారంలో జాన్సన్‌నాయక్, నాయకులు

ఖానాపూర్: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఖానాపూర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. ఆదివారం పట్టణంలో మార్నింగ్‌వాక్ చేస్తూ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో రాజేందర్, రాము నాయక్, కరిపె శ్రీనివాస్, వెంకట్‌మహేంద్ర, ప్రదీప్, రవి, సుమిత్ తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని కన్నాపూర్ గ్రామంలో ఏఎంసీ డైరెక్టర్ బోయిని మంగ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటా తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుకు ఓటేసి జాన్సన్ నాయక్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీహరిరావును గెలిపించాలని ప్రచారం

లక్ష్మణచాంద: తెలంగాణ ఉద్యమ నాయకుడు కూచాడి శ్రీహరిరావును నిర్మల్‌గా ఎమ్మెల్యేగా గెలిపించాలని మండల కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేశారు. ఆదివారం మండల కేంద్రంలో అట్ల రవీందర్‌రెడ్డి, నాయకులతో కలిసి కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ఓటర్లకు వివరించారు. ఉమ్మడి జిల్లాలో శ్రీహరిరావు తెలంగాణ ఉద్యమాన్ని ముందుండి నడిపించారని గుర్తు చేశారు. వారి వెంట నాయకులు శ్రీనివాస్, నాగేశ్, రవి, రాజేశ్వర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో పలువురు చేరిక

లక్ష్మణచాంద: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నేత ఈటెల లచ్చన్న, యువకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ మండల ఇన్‌చార్జి నర్సింగ్ రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. మండలాధ్యక్షుడు రాజేశ్వర్, అట్ల రాంరెడ్డి, చిన్న రాంరెడ్డి, రవీందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షులు నాగేశ్, శ్రీనివాస్, సమ్మెట రవి, సాయికిరణ్ పాల్గొన్నారు.

కడెం: మండలానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ మండలాధ్యక్షుడు రాజేశ్వర్‌రెడ్డి, లింగాపూర్ మాజీ సర్పంచ్ జమున, గంగాధర్‌గౌడ్, శ్రీనివాస్ ఖానాపూర్‌లో కాంగ్రెస్‌లో చేరారు. వారికి శ్రీహరిరావు, వెడ్మ బొజ్జు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కడెం ఎంపీపీ అలెగ్జాండర్ ఉన్నారు.



లక్ష్మణచాందలో ప్రచారం చేస్తున్న రవీందర్‌రెడ్డి

వెంకూర్‌లో బోనాల సందడి



బోనాలతో వెళ్తున్న గ్రామస్తులు

కుంటాల: మండలంలోని వెంకూర్ గ్రామంలో ముత్యాలమ్మ, మహాలక్ష్మి, చాంద మహంకాళి, భూలక్ష్మి, చిలకలమ్మ, పోతరాజు ఆలయాల నాలుగో వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో, యువకులు బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకున్నారు. శివసత్తుల పూనకాలు అలరించాయి. గ్రామానికే చెందిన బాజీరావు పటేల్ అన్నదానం ఏర్పాటు చేశారు. సర్పంచ్ మగ్గిడి శృతి, ఉపసర్పంచ్ భారతిబాయి, అర్చకులు మోనాజీ శాస్త్రీ, జి.రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.